సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం। 26। ఫిబ్రవరి। 2025



సోమశిలలో 60.045 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 60.045 టీఎంసీ నీరు నిల్వ ఉంది. 1035 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3830 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.89,500
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,098
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,341
సవర (8 గ్రాములు)	రూ.66,728

గరిష్టం/కనిష్టం
33.5 /24.0

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుందని, ఎండ తీవ్రత ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం



మద్దిబోయిన సుందరయ్య



దూబిశెట్టి చంద్రశేఖర్

నెల్లూరు (లీగల్): నెల్లూరు ఫ్యామిలీ కోర్టు కమ్ 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీగా సీనియర్ న్యాయవాది మద్దిబోయిన సుందరయ్య, బాలలపై లైంగికక దాడుల విచారణ ప్రత్యేక కోర్టు (పోక్సో) ఏపీపీగా దూబిశెట్టి చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత మూడేళ్ల పాటు ఏపీపీలుగా కొనసాగుతారు.

రైతులకు యూనీక్ కోడ్ అవసరం

నెల్లూరు(సెంట్రల్): రైతులకు యూనీక్ కోడ్ అవసరమని, అందుకు సంబంధించి ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1.71 లక్షల మంది పీఎం కిసాన్ రైతులు ఉన్నారని, ఇప్పటి వరకు లక్ష మందికిపైగా రైతులకు యూనిక్ కోడ్ కేటాయించామన్నారు. మిగిలిన దాదాపు 71 వేల మంది రైతులు యూనీక్ కోడ్ నంబర్ పొందాల్సి ఉందన్నారు. గ్రామాల్లోకి వ్యవసాయ శాఖ అధికారులు వచ్చినప్పుడు, లేక రైతు సేవా కేంద్రాల్లో యూనీక్ కోడ్ నంబర్ తీసుకోవాలని కోరారు. ఈ కోడ్ ఉంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే వ్యవసాయ పథకాలు అందుతాయని తెలిపారు.

28 లోపు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): జిల్లాలో 2025–26కు సంబంధించి అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అఫిలియేషన్ రెన్యువల్, అదనపు సెక్షన్లు, కోర్సులు, ద్వితీయ భాష, మీడియం, పేరు, మేనేజ్‌మెంట్ మార్పు, మూసివేత, లేదా పునః ప్రారంభం, ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదు విడుదలకు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఎఫ్‌డీఆర్ విడుదల, సొసైటీ, మేనేజ్‌మెంట్ మార్పు ఏడాదిలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు, నిర్ణీత ఫీజు, సంబంధిత దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసిన కళాశాలలను తనిఖీ కమిటీలు సందర్శించి అందజేసిన నివేదిక ఆధారంగా బోర్డు అదనపు సెక్షన్లను అమలు చేస్తుందన్నారు. ఇతర వివరాల కోసం జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

బిట్రగుంట: బోగోలు మండలం తాళ్లూరు, కొత్తూరు, వెస్టన్ కాలనీ, రామస్వామిపాళెం తదితర ప్రాంతాలకు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట సాగుతోందనే సమాచారంతో అటవీశాఖ అధికారులు మంగళవారం వేకువన విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కొత్తూరు, రామస్వామిపాళెం, తాళ్లూరుకు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో జింకలు, అడవి పందుల సంచారం ఎక్కువగా ఉండడంతో కొంత మంది ఉచ్చులు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో వేట సాగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల గౌరవరం కేంద్రంగా జింక మాంసం కూడా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కొత్తూరుకు సమీపంలోని పొలాల్లో కొంత మంది రైతులు అడవి పందులు పంటలు పాడు చేయకుండా ఉండేందుకు విద్యుత్ తీగలు అమర్చి ఉండడాన్ని గుర్తించి సంబంధిత రైతులను అధికారులు మందలించారు. విద్యుత్ తీగల కారణంగా వన్యప్రాణులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సుమన్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): న్యాయవాదుల చట్టం – 1961కు సవరణలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వొకేట్ యాక్ట్ – 2025కు వ్యతిరేకంగా గురు, శుక్రవారాల్లో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించనున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్, జాయింట్ సెక్రటరీ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సమావేశ మందిరంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

మిల్లర్ల దోపిడీకి మద్దతు



భయపడినట్లుగానే ధాన్యం ధరలు పతనం

చంద్రబాబు పాలన అంటేనే.. అన్నదాతలకు హడల్. రైతులు ముందే భయపడినట్లే ధాన్యం ధరలు దారుణంగా పతనం అయ్యాయి. గత సీజన్ వరకు ధాన్యాన్ని నిలబెట్టి డిమాండ్‌గా అమ్ముకున్నారు. ఈ సీజన్ నాటికి టీడీపీ ప్రభుత్వంలో అధికారంలో ఉండదంతో రైతుల పాలిట శాపంగా మారింది. గతేడాదికి ఈ ఏడాదికి సగానికి సగం ధర దిగజారిపోవడం చూస్తే రైతులపై టీడీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. గత ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఇతర జిల్లాల మిల్లర్లను రప్పించి డిమాండ్ పెంచింది. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా మిల్లర్ల దోపిడీకి మద్దతుగా నిలుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధరలు కల్పించలేమన్నట్లుగా ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనతో స్పష్టమైంది.

- చేతులెత్తేసిన మంత్రి నాదెండ్ల
- ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,320, సాధారణ రకం రూ.2,300
- మద్దతు ధర కల్పన.. ప్రకటనలకే పరిమితం
- గత సీజన్‌లో బీపీటీ పుట్టి రూ.28 వేలకు పైగా విక్రయం
- ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.16 వేలు మాత్రమే
- ఇతర జిల్లాల మిల్లర్లను రప్పించి డిమాండ్ పెంచిన గత ప్రభుత్వం
- ఊరూరా అన్నదాతల ఆక్రందనలు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ధాన్యం దిగుబడులు, ధరలు అన్నదాతలను హతాశులను చేస్తోంది. కరువు కాటకాలు, విపత్తులు, అకాల వర్షాలను అధిగమించి సాగు చేస్తే.. ప్రకృతి శాపమో, పాలకుడి పాదమో తెలియదు కానీ దిగుబడులు తగ్గాయి. ధరలు పతనమయ్యాయి. ఎటు చూసినా అన్నదాతల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ప్రకృతి సహకరించక ధాన్యం దిగుబడులు తగ్గి రైతులు ఆందోళనకు గురవుతుంటే మరో పక్క రైస్ మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధరలు తగ్గించి రైతుల నడ్డి విరుస్తున్నారు. అధికారులు చెబుతున్న పరిస్థితులకు, వాస్తవానికి పొంతన లేకుండా ఉంది.

గతేడాది రూ.28 వేలు.. ఇప్పుడు రూ.16 వేలు ప్రస్తుత టీడీపీ పాలనలో రైతులకు 'మద్దతు' దక్కడం లేదు. మిల్లర్ల దోపిడీకే 'మద్దతు' లభిస్తోంది. ధాన్యానికి అధికారికంగా ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,320 (పుట్టి రూ.19604) సాధారణ రకం రూ.2,300 (పుట్టి రూ.19,435) మద్దతు ధర ప్రకటించినా.. ప్రస్తుతం బీపీటీలను పుట్టి రూ.15 వేల నుంచి రూ.16 వేలకే రైస్‌మిల్లర్లు, దళారులు కుమ్మక్కై, కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో పుట్టి ధాన్యం ఊహించని విధంగా పుట్టి ధాన్యం బీపీటీ రకం రూ.27 వేల నుంచి రూ.28 వేలకు ధరలు పలికాయి. దీన్ని బట్టి ప్రభుత్వం ప్రకటించిన 'మద్దతు' రైతులకా? మిల్లర్లకా? అనేది స్పష్టమవుతోంది.


ప్రకృతి శాపం.. ప్రభుత్వ నిర్లక్ష్యం

ఈ ఏడాది ప్రకృతి శాపం.. ప్రభుత్వం నిర్లక్ష్యం వెరసి అన్నదాతలకు ప్రాణసంకటకంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ధాన్యం ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఈ రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,57,500 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. అయితే మంచు అధికంగా కురవడం, చలి ఎక్కువ కాలం ఉండడం వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వరి దిగుబడులు తగ్గాయి. దీంతోపాటు ధాన్యం ధరలు కూడా తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి కోతలు ఊపందుకున్నాయి. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం పుట్టికి రూ.12 వేల వరకు నష్టపోతున్నారు. జిల్లా అధికారుల నుంచి ప్రభుత్వ పెద్దలకు పంటకు మద్దతు ధర కల్పిస్తామంటూ చెబుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో కనీస ధరలు అమలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లాకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మద్దతు ధర కల్పిస్తామంటూనే.. ఈ సారికి మా ప్రభుత్వంపై కనికరం చూపాలంటూ రైతు సంఘాల నేతలను బతిమిలాడుకోవడం చూస్తే పరిస్థితి అర్థమవుతోంది.

మద్దతు ధర కల్పించేలా చర్యలు

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. ధరలు తగ్గించిన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులు బహిరంగ మార్కెట్లో ధరలు అధికంగా ఉంటే అక్కడ విక్రయించుకోవచ్చు.

– అంకయ్య, డీఎస్‌ఓ



జలదంకి మండలంలో ధాన్యం కోసి రోడ్డుపై కుప్పలుగా పోసిన రైతులు

గతంలో మద్దతు ధరలు అమలు

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా వస్తే రైతులు బయటకు అమ్ముకునే విధంగా అవకాశం కల్పించింది. ప్రతి రైస్‌మిల్లర్ ఆర్‌బీకేల ద్వారానే ధాన్యం కొనుగోలు చేయాలనే నిబంధనలు పెట్టింది. అప్పటి జిల్లా అధికార యంత్రాంగం రైస్ మిల్లర్లను దగ్గరకు రానివ్వకుండా ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, వైఎస్సార్, కర్నూలు తదితర జిల్లాల రైస్ మిల్లర్లను ఆహ్వానించారు. దీంతో ధాన్యానికి డిమాండ్ పెంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఎంత మద్దతు ధర ప్రకటించిందో అంతే ధరకు రైతులు ధాన్యాన్ని అమ్ముకున్నారు. మార్కెట్‌లో బీపీటీ, నెల్లూరు మసూర, ఇతర రకాలకు డిమాండ్ అధికంగా ఉంది. వైఎస్సార్‌సీపీ పాలనలో పుట్టి రూ.27 వేల నుంచి రూ.28 వేల వరకు కొనుగోలు చేశారు.

ధాన్యం ధరలు ఆశాజనకంగా లేవు



ఈ ఏడాది వరి సాగు నుంచి ధాన్యం విక్రయం వరకు ఇబ్బందులే. ధాన్యం ధరలు కూడా ఆశాజనకంగా లేవు. గతేడాది పుట్టి వరి కోతల సమయంలో రూ.24 వేలు ఉంటే.. ఈ ఏడాది రూ.18,000 కూడా కొనుగోలు చేయడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరుతో బస్తాకు 3 నుంచి 5 కేజీల తరుగు తీస్తున్నారు. ఈ ఏడాది దిగుబడులు కూడా తగ్గాయి.

– వాకా శ్రీనివాసులురెడ్డి, రైతు

రైతులను పట్టించుకోవడం లేదు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది అధిక వర్షాలు, విపరీతమైన మంచు కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. నాటిన నెల రోజుల లోపే వెన్ను తీసింది. ఎకరాకు 40 నుంచి 50 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా, 20 నుంచి 25 బస్తాలకు పడిపోయింది. ఈ ఏడాది రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

– రావి మాల్యాద్రి, సీపీఎం నాయకుడు, జలదంకి

- కలెక్టర్ ఆనంద్‌కు రైతుల విజ్ఞప్తి

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించండి

పొదలకూరు: వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించమని మండలానికి చెందిన పలువురు రైతులు కలెక్టర్ ఓ ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టర్ మండలంలోని మహ్మదాపురం గ్రామానికి రావడంతో అక్కడి రైతులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారు మాట్లాడుతూ రబీలో పండించిన ధాన్యం దిగుబడి దారుణంగా ఉందని, దీనికితోడు ధరలు గిట్టుబాటు కావడం లేదన్నారు. కళ్లాల్లో మిల్లర్లు కేఎన్‌ఎం 1638 రకం ధాన్యాన్ని రూ.17,500 కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దిగుబడి ఎకరాకు 2 నుంచి 2.50 పుట్లు ధాన్యం మాత్రమే దిగుబడి అవుతోందని రైతుకు మిగిలేదేమి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యంలో 22 నుంచి 23 తేమ శాతం వస్తుందని, అధికంగా ఉంటే మిల్లర్లకు తరుగు ఇచ్చేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. గతేడాది ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఇంకా కేంద్రం తెరవలేదన్నారు. వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించాల్సిందిగా కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకుంటే సమస్య ఉండదన్నారు. నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు.



కలెక్టర్ ఆనంద్‌తో మాట్లాడుతున్న రైతులు

రుస్తుంపై రుబాబు

రెడ్‌బుక్ కుట్రతోనే గనుల శాఖ డీడీ కేసు నమోదు

- 2023 డిసెంబర్‌లో సోమిరెడ్డి ఫిర్యాదుపై మైనింగ్ శాఖ జాయింట్ ఇన్‌స్పెక్షన్
- అక్రమ మైనింగ్ జరగలేదంటూ నివేదిక
- ఇప్పుడు ఆ శాఖ అధికారులే ప్లేటు ఫిరాయించి తప్పుడు కేసులు
- సోమిరెడ్డి ఇసుక దోపిడీ బయటకు రావడంతో డైవర్షన్ రాజకీయం

వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా అధికార పార్టీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఏ తప్పు జరగకపోయినా.. తప్పుడు కేసులు పెట్టి వేధించడమే పనిగా వ్యవహరిస్తున్నారు. సోమిరెడ్డి ఇసుక దోపిడీ వ్యవహారంపై దుమారం రేగడంతో ఆ విషయాన్ని డైవర్ట్ చేయడం కోసం తాజాగా 'క్లీన్‌చిట్' ఉన్న 'రుస్తుం' మైన్స్‌పై ఏడాది తర్వాత తెరపైకి తెచ్చి రు'బాబు' చేస్తున్నారు. మైనింగ్ శాఖ జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్ అక్కడ అక్రమ మైనింగ్ జరగలేదని చెబితే.. అదే శాఖ ఇప్పుడు అక్రమ మైనింగ్ జరిగిందంటూ తప్పుడు కేసు పెట్టడం చూస్తే అధికార పార్టీ దాష్టీకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం దాష్టీకానికి పొదలకూరు మండలంలోని తాటిపర్తిలో ఉన్న 'రుస్తుం' మైన్స్‌పై నమోదు చేసిన తప్పుడు కేసు అద్దం పడుతోంది. స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేస్తున్న ఇసుక దోపిడీ వ్యవహారం బట్టబయలు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా దూమారం రేగుతోంది. ఈ విషయాన్ని డైవర్ట్ చేయడానికి దాదాపు 14 నెలల క్రితం తానిచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలంటూ మైనింగ్‌శాఖపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు చేయించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రుస్తుంపై తప్పుడు కేసు

జిల్లాలో అధికార యంత్రాంగం వాస్తవాలను పక్కన పెట్టి అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఊడిగం చేస్తోంది. ఎమ్మెల్యేలు ప్రేరేపించిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కాగా అమలు చేస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల తలొగ్గి.. మైనింగ్ శాఖాధికారులు ఆఖరికి తమ శాఖనే కించపరుస్తున్నారు. ఎమ్మెల్యేలు చెప్పారని.. అధికారులు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారు. తాజాగా పొదలకూరు మండంలంలోని తాటిపర్తిలో ఉన్న 'రుస్తుం' మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందంటూ గనుల శాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాస్తవాలు తెలుసుకోకుండానే అధికార పార్టీ ఒత్తిళ్లతో ఆగమేఘాలపై కేసు నమోదు చేశారు.

మైనింగ్‌శాఖ క్లీన్‌చిట్ ఇస్తే..

పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామ సర్వే నంబర్లు 697, 699,751/2, 759/1, 759/2, 924, 925ల్లోని ప్రభుత్వ భూముల్లో 32.71 ఎకరాల విస్తీర్ణంలో రుస్తుం మైనింగ్‌కు 2016 ఏప్రిల్ వరకు అనుమతి ఉంది. లీజు గడువు పూర్తికావడంతో యజమాని సైతం దాన్ని వదిలేశారు. అక్కడ మైనింగ్ వ్యవహారాలు కూడా జరగడంలేదు. అయితే 2023 డిసెంబర్‌లో అక్కడ అక్రమ మైనింగ్ జరుగుతోందని సోమిరెడ్డి మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు జాయింట్ తనిఖీ నిర్వహించారు. ఆ మైన్స్‌లో అక్రమ మైనింగే జరగలేదని, ఆ ప్రాంతంలో ఫెల్డ్‌స్పార్, క్వార్ట్జ్ మిశ్రమం కలిసిన పాత నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఎక్కడ యంత్రాలు పెట్టి తవ్వకాలు చేసిన ఆనవాళ్లు సైతం కనిపించలేదు. రెండు శాశ్వత భవనాలు సైతం పాడుబడినవి ఉన్నట్లు గుర్తించి ఆ మేరకు నివేదిక ఇచ్చారు. ఆపై రెండు నెలల వ్యవధిలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ప్రభుత్వం మారింది. అసలు ఆ మైన్స్‌లో ఎక్కడా అక్రమాలు జరగలేదని నిర్ధారించి నివేదిక ఇచ్చిన ఆ శాఖ అధికారులే ప్రభుత్వం మారిన తొమ్మిది నెలలకు అక్రమ మైనింగ్ జరిగిందంటూ పోలీసు కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది. ఈ కేసులో గనుల శాఖ అధికారులు న్యాయస్థానం ముందు దోషులుగా నిలబడక తప్పదని న్యాయ నిపుణులు చెబుతున్నారు.



Joint Inspection Report

As per instructions of the DMG&O, Nellore and on complaints filed by Sri Y.Vidya Kiran and Sri Somireddy Chandramohan Reddy, former Agricultural Minister received on 06.12.2023, we have been proceeded to complaint area of M/S Rustum Mica Mining company, Tatiparthi Village, Podalakur Mandal, SPSR Nellore District on 08.12.2023.

During the course of inspection, it is observed that the mine is not working and no men or Machinery were found in the leased area. Further it is noticed that Past one (01) month back Illicitors were picking the Quartz boulders from '99' and stocked scatteredly in the leased area. The stocked quantity is approximately about 1050 MT of Quartz & Feldspar mixed Mica is noticed. Due to heavy cyclone effect, all worked pits were water logged. Two abandoned permanent buildings were noticed and 4 places old dumps were noticed in the area.

As per verification of this office records, the Mine is M/s. Rustum Mica Mining company over an extent of 32.71 Acres in Sy Nos :697, 699, 751/2, 759/1, 759/2, 924 and 925 of Tatiparthi village, Podalakur Mandal, SPSR Nellore District with a validity of from 18.04.1996 to 18.04.2016. The photographic evidences are here with enclosed for further taking necessary action as per Rules in force.

2023లో మైనింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక

రెడ్‌బుక్ కుట్రతోనే..

ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతి, అక్రమాలపై నిత్యం ప్రశ్నిస్తున్న మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని టార్గెట్ చేసి అక్రమ కేసుల్లో ఇరికించేందుకు అధికార యంత్రాంగం సర్వశక్తులు ఒడ్డుతోంది. ఎక్కడా అవినీతి జరిగినట్లు రుజువులు లేకపోవడంతో 'రుస్తుం' మైన్స్‌లో ఆయన్ను ఇరికించేందుకు చేసిన ప్రయత్నాలు ప్రారంభించారు. మైనింగ్ అధికారులు తొమ్మిది నెలల తర్వాత పొదలకూరు స్టేషన్‌లో రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందంటూ అందులో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులరెడ్డితోపాటు మరికొందరు అంటూ మైనింగ్ డీడీ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు రెడ్‌బుక్ కుట్రలో భాగంగానే జరిగిందని, అత్యుత్సాహం చూపే అధికారులు తప్పక శిక్ష అనుభవించక తప్పదని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరిస్తున్నారు.

టీడీపీది దుర్మార్గ సంస్కృతి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- దాడులు చేయడం.. జైలుకు పంపడం వారి నైజం
- కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: అధికారం చేతిలో ఉందని కావలి నియోజకవర్గంలో టీడీపీ నేతలు దుర్మార్గ సంస్కృతికి తెరతీశారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం అనే కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ దాష్టీకానికి కావలి సబ్ జైల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీ కోళ్లదిన్నెకు చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు శ్రీనివాసులురెడ్డిపై టీడీపీ గూండాలు కాపు కాచి దాడి చేయడంతో పాటు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరిన తర్వాత మరోసారి అతనిపై, తోడుగా వచ్చిన అట్ల రాజా, వెంకటేశ్వర్లు, పులి శ్రీహరిపై కత్తులతో దాడి చేసిన విషయం రాష్ట్రమంతా చూసిందన్నారు. అయినా కూడా పోలీసులు బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టి 20 రోజులుగా సబ్‌జైల్లో ఉంచడం దారుణమన్నారు. అధికారులు అధికార పార్టీ నాయకుల మాటలు విని తప్పుడు కేసులు పెడితే ఆ ఫలితం తప్పకుండా అనుభవించాల్సి ఉంటుందన్నారు. తమ పార్టీ కార్యకర్తలతోపాటు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లపై తప్పుడు కేసులు పెట్టి జైలు పాల్జేయడం సరికాదన్నారు.

రైతుల కడుపుకొడుతున్నారు..

నియోజకవర్గంలో అభివృద్ధి లేదు.. ఉపాధి లేదు.. మరో వైపు రైతుల కడుపుకొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించక పోవడంతో దిగుబడులు కూడా భారీగా తగ్గాయి. పంటలకు కనీస మద్దతు ధర లేదని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మచ్చుకు కూడా కనిపించడం లేదన్నారు. తీరంలో ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే పూర్తయ్యాయన్నారు. వీటి అనుబంధంగా పరిశ్రమలకు సంబంధించి భూములకు అప్పట్లో ఎకరాకు ప్రభుత్వం రూ.30 లక్షల పరిహారం ఇచ్చేందుకు సిద్ధం కాగా, టీడీపీ అధికారంలోకి వస్తే రూ.50 లక్షలు ఇస్తామని మభ్య పెట్టిన టీడీపీ నాయకులు ప్రస్తుతం రూ.11 లక్షలే ఇస్తామని ప్రకటించి బలవంతపు భూసేకరణకు పాల్పడుతుండటం దారుణమన్నారు. ప్రశ్నించిన వాళ్లపైన కేసులతో బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. తమ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెబుతున్నట్లుగా తప్పుడు కేసులు పెట్టే వాళ్లను, పెట్టించే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమని స్పష్టం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మద్దిబోయిన వీర రఘు యాదవ్, కల్యాణ్‌కుమార్, ఉప్పాల మాచర్ల, ప్రభాకర్‌రెడ్డి, ఏకే సుందర్‌రాజు, పాపన మల్లారెడ్డి, గ్రంథం ప్రసన్నాంజనేయులు, సమాధి చైతన్య, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, షేక్ నాయబ్ రసూల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

దూరపు బంధువునని పరిచయం చేసుకుని..

- వృద్ధురాలి బంగారు గొలుసుతో ఉడాయింపు
- పోలీసుల అదుపులో నిందితుడు?

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని ఏమార్చి సుమారు నాలుగు సవర్ల బంగారు గొలుసుతో గుర్తుతెలియని దుండగుడు ఉడాయించిన ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట కొత్తవీధిలో బి.రాజేశ్వరి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె సోమవారం మధ్యాహ్నం ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్‌కు వెళ్లింది. పూలు కొనుగోలు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి మీ దూరపు బంధువు లక్ష్మి కుమారుడినని పరిచయం చేసుకున్నాడు. ఇంటి వద్ద విడిచి పెడతానని ఆమెను స్కూటీపై ఎక్కించుకుని దారిలో తాను బంగారు పనిచేస్తున్నాని మాటలు కలిపాడు. మీ మెడలోని బంగారు గొలుసు కేడీఎం చైన్‌లా లేదని వృద్ధురాలికి అనుమానం వచ్చేలా చెప్పాడు. గొలుసు ఇస్తే కేడీఎం చేసి ఇస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె తన మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తీసి అతడికి ఇచ్చింది. ఆమెను కుమ్మరవీధి వద్ద దించి గొలుసు చూస్తున్నట్లు నటిస్తూ నిందితుడు బైక్ వేగం పెంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు మంగళవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గంటల వ్యవధిలోనే సాంకేతికత ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతను బీటెక్ చదివి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నాడని, ఖర్చుల కోసం గొలుసు చోరీకి పాల్పడినట్లు సమాచారం.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

వెంకటాచలం: మండలంలోని దిగువ వెంకటరెడ్డిపాళెం సమీపంలోని నక్కల కాలువలో గుర్తుతెలియని వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. దుర్వాసన వస్తుండటంతో రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 60 సంవత్సరాల వయసు ఉంటుందని భావిస్తున్నారు. మృతికి గల కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 86
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 162
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 182
లేయర్ చికెన్	: 127





ఉదయగిరి దుర్గం

దుర్గం.. విధ్వంసం

జిల్లాలో చారిత్రాత్మకమైన కట్టడాలు, విలువైన సంపద, ఔషధ మొక్కలకు నిలయమైన ఉదయగిరి దుర్గం విధ్వంసం అయిపోతోంది. ప్రకృతి ప్రేమికులను అలరించే దుర్గం వైభవం, రూపురేఖలు కోల్పోతోంది. దుర్గంపై ఉన్న కోటకు ఐదు శతాబ్దాల చరిత్ర ఉంది. పల్లవులు, చోళులు, విజయనగర రాజులు, మహ్మదీయ వంశీయులు, ఆంగ్లేయుల పాలనా కేంద్రంగా గతంలో ఇది విరాజిల్లింది. ఈ నేపథ్యంలో కోటపై నిర్మించిన అనేక కట్టడాల కింద బంగారు ఆభరణాలు ఉంటాయని ప్రజలు విశ్వసిస్తుంటారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా విలువైన పురాతన కట్టడాలను గుప్తనిధుల కోసం గుల్లచేశారు.

గుప్తనిధుల కోసం యథేచ్ఛగా తవ్వకాలు

- చారిత్రాత్మక చిహ్నాలు పెకలించేస్తూ..
- మొక్కుబడిగా అటవీ శాఖ సిబ్బంది, పోలీసుల గాలింపు
- తవ్వకాల వెనుక వీరి పాత్రపై అనుమానాలు
- గతంలో విలువైన పురాతన సంపద దోపిడీ
- ప్రత్యేక దర్యాప్తు అధికారులతో నిజాలు వెలుగు చూసే అవకాశం


ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై అనేక చారిత్రాత్మక కట్టడాలున్నాయి. అలనాటి రాచరిక పాలన అంతరించిన తర్వాత మహ్మదీయులు పాలించిన కాలంలో అనేక కట్టడాలు ధ్వంసమయ్యాయి. సంప్రదాయ కట్టడాలు నేలమట్టం చేసి మసీదులు, బురుజులుగా మార్చారు. ఈ క్రమంలో అప్పటి కట్టడాల్లో విలువైన బంగారం, వజ్రాలు స్వాహా చేశారు. అనంతరం బ్రిటిష్ పాలన రావడంతో వారు కూడా సంపద కోసం అన్వేషణ చేసి దోచుకున్నారనే ప్రచారం ఉంది. స్వతంత్ర భారతంలో కూడా గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి.. జరుగుతూనే ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత గుప్తనిధుల కోసం తవ్వకాలు మరీ ఎక్కువగా సాగుతున్నాయి. సెన్సార్ పరికరాలతో ప్రాచీన కట్టడాల అడుగు భాగంలో ఉన్న విలువైన సంపద గుర్తించి రాత్రి వేళల్లో తవ్వకాలు సాగిస్తున్నారు.

మళ్లీ తవ్వకాలు

ఇటీవల దుర్గంపై రాత్రి వేళల్లో లైటింగ్ కాంతుల్లో గుప్తనిధులు కోసం తవ్వకాలు జరిగాయి. మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగింది. రాత్రి వేళ దుర్గంపై కాంతులు కనిపించడంతో స్థానికులు గుప్తనిధుల ముఠా పనిగా అనుమానాలు వ్యక్తం చేశారు. మీడియాలో కూడా కథనాలు వచ్చాయి. పోలీసు, అటవీ అధికారులు ప్రత్యేక దళంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో గుప్తనిధుల కోసం సాగుతున్న తవ్వకాలను ఆపు చేసినట్లు సమాచారం. అయితే అక్కడ ప్రస్తుతం తవ్వకాలు జరిగినట్లు ఎక్కడా ఆధారాలు లేవంటూ ఈ బృందం బుకాయించింది. పోలీసులు, అటవీ శాఖ బృందం ఎందుకు ఈ విషయాన్ని దాచిపెట్టిందో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. గతంలో కూడా ప్రకాశం జిల్లాకు చెందిన ఓ ముఠా అక్కడే మకాం పెట్టి పేలుడు సామగ్రితో తవ్వకాలు జరిపారు. ఆ ముఠాలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్పట్లో ఇది సంచలనంగా మారింది. పేలుడు ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేక నరబలి ఇచ్చారా? అనే అనుమానాలు తలెత్తాయి. అయితే పోలీసు దర్యాప్తులో ప్రమాదంగా చెప్పినప్పటికీ, స్థానికులు మాత్రం ఇది నరబలిగానే ఇప్పటికీ అనుమానిస్తున్నారు.

అటవీ, పోలీస్ సిబ్బంది పాత్రపై అనుమానాలు

ఉదయగిరి దుర్గం అటవీ శాఖ పరిధిలో ఉంటుంది. ఇక్కడ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అటవీ శాఖ అధికారులు ఘటనలు జరిగినప్పుడు నాలుగు రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత షరా మాములే. ఈ తవ్వకాల ముఠాకు మర్రిపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తితో సంబంధాలున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆ వ్యక్తి అటవీ, పోలీసు శాఖలో ఉన్న దిగువ స్థాయి సిబ్బందితో సంబంధాలు పెట్టుకుని ఈ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. అటవీ, పోలీసు శాఖల్లో ఇప్పటికీ కీలకమైన సిబ్బంది గుప్తనిధుల ముఠాతో సంబంధాలు సాగిస్తున్నారు. ఈ విషయం పైస్థాయి అధికారులకు తెలిసినా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. దీంతో అక్రమార్కులు సులువుగా తప్పించుకుంటున్నారు. ఇంటి దొంగల గుట్టు రట్టు చేయాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపడితే అనేక వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందని తెలుస్తోంది.



ఉదయగిరి పట్టణంలో ధ్వంసమైన రాజ్‌మహల్

గుప్తనిధుల ముఠాపై నిఘా పెట్టాలి



ఉదయగిరి కొండపై ఉన్న దుర్గంలో అనేక ప్రాచీన కట్టడాలున్నాయి. ఈ కట్టడాల్లో విలువైన సంపద కోసం కొంతమంది అక్రమార్కులు వేట సాగిస్తున్నారు. ప్రాచీన కట్టడాలు ధ్వంసం అవుతున్నాయి. ఇలా అయితే రాజుల కాలం నాటి పురాతన కట్టడాల సంపద భవిష్యత్ తరాలు చూసే అవకాశం లేదు. ఈ వారసత్వ సంపదను కాపాడుకోవాలి. గుప్త నిధులు తవ్వే ముఠాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలి.

– జి.ఓబులరెడ్డి, విశ్రాంత ఎంఈఓ

వేధిస్తున్నారంటూ వివాహిత ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): భార్యను వేధింపులకు గురిచేయడమే కాకుండా దాడి చేసిన భర్త, అతడికి సహకరిస్తున్న కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బీవీ నగర్‌కు చెందిన అరుణకు 2017లో ప్రసాద్ అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రసాద్ మహిళలతో సన్నిహితంగా ఉంటూ భార్యను వేధింపులకు గురిచేయసాగాడు. ఈ విషయమై పలుమార్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో వారు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇటీవల ప్రసాద్ ఓ మహిళతో ఫోన్‌లో మాట్లాడుతుండగా భార్య నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన అతను అరుణపై దాడి చేశాడు. ఈ విషయమై నిలదీసిన అరుణ కుటుంబ సభ్యులు, బంధువులపై సైతం ప్రసాద్ దౌర్జన్యం చేశాడు. తనను వేధింపులకు గురిచేయడమే కాకుండా దాడి చేసిన భర్త, అతడికి సహకరిస్తున్న అత్తింటివారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో బీభత్సం

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లి పీర్లచావిడి సమీపంలో సోమవారం రాత్రి కొందరు యువకులు మద్యం మత్తులో ఉన్న కారులో వెళ్తూ బీభత్సం సృష్టించారు. వేగంగా కారును నడిపుతూ సిమెంట్ బెంచీలు, మోటార్‌బైక్‌ను ఢీకొట్టగా అవి ధ్వంసమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఈ ముగ్గురు యువకులు వడ్లమూడిపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుందని చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.47
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.22



డీఐజీ కిరణ్‌కుమార్ సస్పెన్షన్

నెల్లూరు సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నెల్లూరు డీఐజీ కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై కిరణ్ దాడి చేశాడని ఇటీవల ఆయన భార్య విజయవాడలో పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసి ందే. అలాగే డీఐజీ విధులపై ఆరోపణలొచ్చాయి. ఈ క్రమంలో ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ శాఖలో కలకలం రేగింది.

ఐదువేల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం



సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించిన ఎస్పీ

- ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడి

ముత్తుకూరు: జిల్లాలో మార్చి 31వ తేదీకల్లా ఐదువేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్పీ జి.కృష్ణకాంత్ వెల్లడించారు. ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సంబంధించిన కంట్రోల్ రూమ్‌ను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్తుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 32 లొకేషన్లలో 55 కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. నేరాలు జరిగినప్పుడు దర్యాప్తును త్వరగా ముగించేందుకు, నేరాలకు పాల్పడిన వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. ట్రాఫిక్ జామ్ అయిన ప్రాంతాలను వెంటనే గుర్తించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటికే 2,500 కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అపార్ట్‌మెంట్లు, జనావాసాలు, వాణిజ్య సముదాయాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నేరాలు అదుపు చేసేందుకు కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నా రు. ప్రజలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు, కృష్ణపట్నం సీఐ రవినాయక్, ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి, కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తుండగా..

- రెండు ట్రాక్టర్ల స్వాధీనం



విడవలూరు: అనుమతి లేకుండా మండలంలోని ముదివర్తి గ్రామం నుంచి మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల కథనం మేరకు.. కొంతకాలంగా పగలు, రాత్రి తేడా లేకుండా మట్టిని చుట్టుపక్కల గ్రామాలతోపాటు, ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని రెండు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఇంతవరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం



క్రీడాకారులతో వీసీ శ్రీనివాసరావు తదితరులు

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 28వ తేదీన సేలంలో జరుగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో వీఎస్‌యూ పురుషుల జట్టు పాల్గొననుంది. జట్టు సభ్యులకు వీఎస్‌యూ వీసీ మంగళవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, కృషి చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు రాణించి వర్సిటీ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎ.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

- రాష్ట్ర స్థాయి విజేతగా ప్రొద్దుటూరు
- తిలకించేందుకు భారీగా వచ్చిన జనం



పోటీల్లో బండ లాగుతున్న ఎద్దులు

కొడవలూరు: మండలంలోని గండవరం ఉదయకోశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు జరిగాయి. ప్రొద్దుటూరుకు చెందిన డి.గురవారెడ్డి, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన కె.రమేష్ యాదవ్‌ల ఎడ్ల జత సంయుక్తంగా విజేతగా నిలిచాయి. వాటికి రూ.లక్ష బహుమతి అందజేశారు. మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్ ఎడ్ల జత రెండో స్థానంలో నిలిచి రూ.75 వేలు అందుకున్నాయి. పల్నాడు జిల్లాకు చెందిన సాయిగణేష్‌శర్మ, కటకం లక్ష్మణ్‌కు చెందిన ఎడ్ల జత మూడో బహుమతి రూ.50 వేలు గెలుచుకున్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన ఎం.సుబ్బారెడ్డికి చెందిన ఎడ్ల జత నాలుగో స్థానంలో నిలిచి రూ.30 వేలు అందుకున్నాయి. బాపట్లకు చెందిన వీరాస్వామి ఎడ్ల జత ఐదో బహుమతి రూ.20 వేలు కైవసం చేసుకుంది. పోటీల్లో మరో నాలుగు ఎడ్ల జతలు పాల్గొనగా వారికి రూ.10 వేల వంతున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విజేతలకు నిర్వాహకులు, పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బహుమతుల ప్రదానం చేసి మాట్లాడారు. ఇక్కడ తొలిసారిగా పోటీలు జరగ్గా తిలకించేందుకు జనం భారీగా తరలివచ్చారు. ఎండ తీవ్రతను లెక్క చేయలేదు. పోటీలను ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య పర్యవేక్షించారు. పోటీలకు వినియోగించిన 2,100 కిలోల బండను చుండి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు అమర్‌నాథ్‌రెడ్డి ఇచ్చారు. కొడవలూరు సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్సై సీహెచ్ కోటిరెడ్డిలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బచ్చు సురేష్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు నలుగురు విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్.వెంకట్రాయులు తెలిపారు. 61 మందికి గానూ 57 మంది హాజరయ్యారని వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- జాయింట్ కలెక్టర్ కార్తీక్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

పొదలకూరు: జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. పొదలకూరు సచివాలయం బిట్ – 3 వద్దనున్న రైతు సేవా కేంద్రంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. రైతులు నిబంధనల ప్రకారం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాల్సిందిగా సూచించారు. పొదలకూరు సొసైటీలో ఏడు వేల గోతాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఉచితంగా రైతులకు అందజేస్తారన్నారు. కేంద్రాల్లో పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. జేసీ వెంట డీసీఓ గురప్ప, ఏడీఏ శివనాయక్, ఏఓ వాసు, తహసీల్దార్ సురేఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.